నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | బుధవారం 7 ఆగస్టు 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

# వెల్లువెత్తిన అభిమానం

## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

- నివాళులర్పించిన ప్రముఖులు
- బీఆర్ఎస్, ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ సంస్థల్లో కార్యక్రమాలు
- ఉద్యమంలో సార్ పాత్ర మరువలేనిది: మంత్రి సీతక్క



నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 6 : ఉద్యమ నేతపై అభిమానం వెల్లువెత్తింది. తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఆయా కలెక్టరేట్లు, బీఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ సంస్థలు, చౌరస్తాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ములుగులో మంత్రి సీతక్క కలెక్టర్ దివాకరతో కలిసి ప్రొఫెసర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ సిద్ధాంత కర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన వ్యక్తి ఆచార్య జయశంకర్ అని మంత్రి కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సార్ చేసిన కృషిని, దృఢ సంకల్పాన్ని ఎప్పటికీ మరిచిపోలేరని అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతి వనం(ఏకశిలా పార్కు)లోని సార్ విగ్రహానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, కలెక్టర్ ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పూలమాలలు వేసి నివాళులర్పించారు. సార్ ఆలోచనలు కిందిస్థాయికి తీసుకెళ్లి జాగృతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని బండా ప్రకాశ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణే శ్వాసే ధ్యాసగా జీవించిన మహనీయుడు జయశంకర్ సార్ అని, ఆయన చూపిన బాటలో పయనిస్తామని అన్నారు. జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సార్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించారు.



జనగామలో జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



హనుమకొండలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, జయశంకర్ కుటుంబ సభ్యులు



ములుగులో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్ దివాకర

# నక్షత్ర దీక్ష స్వీకరించిన మంత్రి పొన్నం




వీరభద్రస్వామి దీక్షను స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6 : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం నక్షత్ర దీక్షను స్వీకరించారు. మొదట స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి దీక్షను తీసుకున్నారు. గురుస్వామి మొగిళిపాలెం రాంబాబు దీక్షను ఆచరించే భక్తులకు మాలధారణ చేపట్టారు. భక్తులకు ఆలయ ఈవో కిషన్ రావు పూర్తి సదుపాయాలు కల్పించారు. అంతకుముందు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కర్ణకంటి మంజులారెడ్డి, అశోక్ ముఖర్జీ, చిట్టంపల్లి ఐలయ్య, చంద్రశేఖర్‌గుప్తా, కేతిరి లక్ష్మారెడ్డి, ఆదరి రవీందర్, కొలుగూరి రాజు, నగరబోయిన నాగరాజు, ఊసకోయిల ప్రకాశ్, మంగ రాంచంద్రం, సుదర్శన్‌రెడ్డి, గుడికందుల రాజు, ఎల్కతుర్తి, వేలేరు ఎస్సైలు సురేశ్, నంద్రు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కిక్కు!

## మత్తుకు అలవాటుపడుతున్న యువత



- విద్యార్థులే టార్గెట్‌గా స్మగ్లర్ల విక్రయాలు
- పల్లెలకూ పాకిన మహమ్మారి
- పోలీసులు నిఘా పెట్టినా ఆగని దందా
- అమలులోకి రాని యాంటీ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో వ్యవస్థ

**ఎందరినో పతనం చేసిన గంజాయి కిక్కు ఇప్పుడు యువతనూ వదలడం లేదు. చదువు కోసం పట్టణాలకు వచ్చిన విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడుతున్నారు. ఒకరిని చూసి మరొకరు కొత్త మత్తుకు అలవాటుపడుతున్నారు. స్కూల్ స్థాయి నుంచి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారే టార్గెట్‌గా స్మగ్లర్లు విక్రయాలు చేపడుతున్నారు. యూత్‌కు డబ్బుల ఆశ చూపి సప్లయ్ రొంపిలోకి దింపుతున్నారు. నగర శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని యథేచ్ఛగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. కొద్దికాలం వరకు నగరానికే పరిమితమైన ఈ మహమ్మారి పల్లెలపైనా పంజా విసురుతోంది. ఇటీవల వరంగల్ కమిషనరేట్ పరిధిలో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారంతా మైనర్లు, 30 ఏళ్లలోపు వారే కావడం విస్మయానికి గురిచేస్తున్నది. గంజాయి రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపినా దందా ఆగడం లేదు. వరంగల్ సీపీ సీరియస్‌గా ఉన్నా కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో దీనికి అడ్డుకట్ట పడడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

*- సుబేదారి, ఆగస్టు 6*



### సీపీ సీరియస్‌గా ఉన్నా..

గంజాయి రవాణా, స్మోకింగ్ కేసులు ఎక్కువ కావడంతో వరంగల్ సీపీ అంబర్ కిషోర్‌ఝా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. జూలై 14న రిజర్వు ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఆర్ఎస్సైలు, సిబ్బందితో డ్రగ్స్ కంట్రోల్ టీంను ఏర్పాటు చేశారు. గంజాయి రవాణా చేసే, సేవించే వారి సమాచారాన్ని 8712584473కు తెలపాలని ప్రజలకు సూచించారు. గంజాయి నియంత్రణ విషయంలో సీపీ సీరియస్ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొంత మంది ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ దందా నిరంతరం కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. లా అండ్ ఆర్డర్ పోలీసులు పట్టించుకోకపోవడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులే నిఘా పెట్టి నిందితులను పట్టుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. కాగా, గంజాయి రవాణా, సేవనం విషయంలో ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల 20 వరకు 35 కేసులు నమోదు చేసి 80 మందిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు తెలిపారు.

### ఇటీవల పట్టుబడిన వారు

- కొద్ది నెలల క్రితం జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు హనుమకొండ కొత్తూరు జెండాలో అద్దెకు ఉంటూ గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లారు.
- ఐనవోలు మండలం కాపులకనిపర్తి గ్రామ శివారు కెనాల్ ప్రాంతంలో నలుగురు యువకులు 2 కిలోల గంజాయి ప్యాకెట్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కారు.
- సుబేదారి పోలీసులు ఈనెల 28న హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మంగపేట మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రూ. 23 వేల విలువ చేసే 880 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు.
- వరంగల్ జిల్లా ఖానాపూర్, చెన్నారావుపేటకు చెందిన ముగ్గురు యువకులు హనుమకొండలోని పెగడపల్లి డబ్బాల సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి తాగుతూ కేయూసీ పోలీసులకు పట్టుబడ్డారు.

గంజాయి స్మోకింగ్ ఇప్పుడు యూత్‌కు కొత్త కిక్కుగా మారింది. ఇప్పటి వరకు నగరానికే పరిమితమైన గంజాయి వినియోగం గ్రామాల్లోనూ పెరిగిపోతున్నది. స్కూల్ స్థాయి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీటెక్, ఫార్మసీ తదితర ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు దీనికి బానిసలవుతున్నారు. వరంగల్‌లో రాత్రి సమయంలో కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, వరంగల్, హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలు, వరంగల్‌లోని ఉర్సు గుట్ట, చిన్నవడ్డేపల్లి చెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, ఖిలా వరంగల్ గుండు చెరువు, రాతికోట, ఎనుమాముల మార్కెట్ శివారు, కాకతీయ కెనాల్ ప్రాంతాలు, హనుమకొండలోని బంధం చెరువు, న్యూశాయంపేట రైల్వే ట్రాక్, ఔటర్ రింగ్ రోడ్డు, పలివేల్పుల, వడ్డేపల్లి చెరువు కట్ట, హాస్టల్స్, అద్దె రూములను అడ్డాగా చేసుకొని గుంపులు, గుంపులుగా గంజాయి స్మోకింగ్ చేస్తున్నారు. ఇటీవల పోలీసులు స్మోకర్స్‌పై నిఘాపెట్టి చాలామందిని పట్టుకున్నప్పటికీ విచ్చవిడిగా కొనసాగుతూనే ఉంది. అమ్మాయిలు సైతం గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నట్లు తెలిసింది.

**డబ్బుల ఆశ చూపి..**

స్మగ్లర్లు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని గుట్టుగా నగరానికి తీసుకొస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నగరానికి చదువుకోడానికి వచ్చిన విద్యార్థులే టార్గెట్‌గా విక్రయాలు సాగిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని కావాల్సిన వారికి సప్లయ్ చేస్తున్నారు. దీనికి తోడు పేద, మధ్య తరగతి విద్యార్థులకు డబ్బుల ఆశ చూపి వారితో గంజాయి ప్యాకెట్లు రవాణా చేయిస్తున్నట్లు తెలిసింది. వీరంతా కాలేజీ బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లను పెట్టుకొని రహస్య ప్రాంతాల్లో స్మోక్ చేసే యువతకు అందజేస్తున్నట్లు సమాచారం.

**అమలులోకి రాని యాంటీ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో**

గంజాయి, ఇతర డ్రగ్స్ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం యాంటీ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో వ్యవస్థను తీసుకురాగా, దేశంలో తొలిసారిగా కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్‌లో అమలులోకి తీసుకొచ్చింది. అయితే కొద్ది నెలలుగా రాష్ట్రంలో గంజాయి మత్తులో దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పోలీసు కమిషనరేట్ పరిధిలో యాంటీ నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరోను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందుకోసం అధునాతమైన పరికరాలను అందజేస్తామని చెప్పింది. కానీ అది ఆచరణలో జరగడం లేదు. ఈ వ్యవస్థ వరంగల్‌కు వస్తే గంజాయి, ఇతర మత్తు పదార్థాల నియంత్రణ మరింత సులభతరం అవుతుందని ఓ పోలీసు అధికారి చెప్పారు.

# వరంగల్ సమగ్రాభివృద్ధికి చర్యలు

- ఈ నెలలోనే నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం
- ఆగమ శాస్త్రం ప్రకారం భద్రకాళీ దేవస్థానం పనులు
- టెక్స్‌టైల్ పార్కులో కంపెనీల ఏర్పాటు.. ఉద్యోగ కల్పన
- మారుమూల ప్రాంతాలకూ వైద్య సేవలు
- సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ, ఆగస్టు 6 : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని, సర్కారు ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలో మంగళవారం వరంగల్ అభివృద్ధిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. సుదీర్ఘంగా నాలుగు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ, భద్రకాళి దేవస్థానం, మెగా టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ ఎయిర్ పోర్టు, నర్సంపేటలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సమీకృత రెసిడెన్షియల్ స్కూల్స్ తదితర అంశాలపై చర్చించారు. అంశాలవారీగా అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాల అమలులో వేగం పెంచాలని, ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల ఎంపికలో స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఏ మాత్రం రాజీపడొద్దన్నారు. వరంగల్ ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్టు కోసం రైతులు సంతృప్తి చెందేలా మానవీయ కోణంలో భూసేకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎయిర్ పోర్టు భూసేకరణకు ఎయిర్ పోర్టు అథారిటీ, ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను మంత్రి ఆదేశించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులను డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 20లోగా కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలని, వచ్చే నెలలో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే చారిత్రక భద్రకాళీ దేవస్థానం అభివృద్ధి పనులను ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టాలన్నారు. మాడవీధుల నిర్మాణంతో పాటు ఆలయం చుట్టూ రాతి బేస్మెంట్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ పార్కులో మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అలాగే సీఎం సమయం తీసుకుని నర్సంపేట మెడికల్ కాలేజీని ఈ నెల మూడో వారంలో ప్రారంభిస్తామని వెల్లడించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మారుమూల ప్రాంతాల్లో పేదప్రజలకు వైద్య సేవలు అందేలా డాక్టర్లను అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూను ఆదేశించారు. ఖమ్మం, వరంగల్ మధ్యలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ఇందుకు అవసరమైన భూమిని సేకరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కే నాగరాజు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ, ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి హరిచందన, సీడీఎంఏ వీపీ గౌతమ్, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పీ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# ర్యాగింగ్ కలకలం

### ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు

హసన్‌పర్తి, ఆగస్టు 6 : హసన్‌పర్తిలోని ఓ కళాశాలలో ర్యాగింగ్ భూతం పడగవిప్పింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థిపై సీనియర్లు దాడి చేయడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండలోని ఓ కళాశాలలో జాటోత్ దిలీప్‌కుమార్ బీబీఏ సెకండియర్ చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కళాశాలలోని గార్డెన్‌లో కూర్చొని భోజనం చేస్తుండగా, ఇదే కళాశాలకు చెందిన సుమారు 15 మంది విద్యార్థులు ర్యాగింగ్ చేస్తూ పిలిచారు. తనను ఎందుకు పిలుస్తున్నారని అడుగగా శ్రీకేశ్, రషీద్‌మాలిక్, నందన్‌తోపాటు మరికొందరు కలిసి అసభ్యకరంగా తిడుతూ దిలీప్‌పై దాడి చేశారు. దిలీప్ ఫిర్యాదు మేరకు కళాశాలతోపాటు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి పోలీసులు తెలిపారు.

# అనుమతుల్లేని క్లినిక్‌లు సీజ్

- రాయపర్తి, మరిపెడలో వైద్యారోగ్య, రెవెన్యూ, పోలీసుల దాడులు
- పరిమితికి మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తింపు
- నర్సంపేటలో ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు



మరిపెడలో ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేయిస్తున్న జిల్లా వైద్యాధికారి కళావతీబాయి



రాయపర్తిలో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రాయపర్తి/మరిపెడ, ఆగస్టు6: వరంగల్ జిల్లా రాయపర్తి, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో అనుమతి లేని క్లినిక్‌లను సీజ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వైద్యారోగ్య, రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో దాడులు చేసి పరిమితికి మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. రాయపర్తిలో పరిమితులు దాటి వైద్యం చేస్తున్న భవానీ క్లినిక్‌పై గిర్దావర్ కొయ్యాడ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది సుమన్, వైద్యారోగ్య సిబ్బంది మథ్యాస్‌రెడ్డి, శ్యాంసుందర్, బుర్ర రవీందర్‌గౌడ్‌తో కలిసి వర్ధన్నపేట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు దాడులు నిర్వహించారు. ఫార్మా-డీ విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేసిన జెరిపోతుల కృష్ణ క్లినిక్‌తోపాటు సొంతంగా ఫార్మసీని ఏర్పాటు చేసుకుని వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. పరిమితులకు మించి వైద్యం చేస్తున్న అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణకు నివేదిక అందజేస్తానని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు. భవానీ క్లినిక్‌ను రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల సమక్షంలో సీజ్ చేసి తాళాలు వేశారు. మరిపెడలో స్థానికుల ఫిర్యాదు మేరకు మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి కళావతీ బాయి ఓ ప్రైవేట్ క్లినిక్‌ను తనిఖీ చేసి ఎలాంటి అనుమతులు లేకపోవడంతోపాటు పరిమితికి మించి రోగులకు వైద్యం అందిస్తుండగా సీజ్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్ తదితరులు ఉన్నారు.

**ఇద్దరు నకిలీ వైద్యులపై కేసు**

నర్సంపేట: నర్సంపేటలో ఇద్దరు నకిలీ వైద్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ వైద్య మండలి రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు ఎన్ఎంసీ చట్టం 34, 54 టీఎస్ఎంపీ 22 ప్రకారం నకిలీ వైద్యులు జయేందర్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌లపై కేసు ఫైల్ చేశారు. గత నెలలో వైద్య మండలి అధికారులు పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ నేతృత్వంలో చేసిన తనిఖీల్లో సదరు వైద్యులు విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. వీటితో భవిష్యత్‌లో చాలా దుష్పరిణామాలు ఉంటాయని డాక్టర్ శేషుమాధవ్ తెలిపారు.

హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి కేడీసీ రోడ్‌లో నిలిచిన వరద నీరు



# దంచికొట్టిన వాన

**నగరంలో జలమయమైన రహదారులు**

**మహబూబాబాద్ జిల్లాలో పలు చోట్ల విరిగిన చెట్లు**

**వరంగల్ నగరంలో వాన దంచికొట్టింది. మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో జోరుగా వర్షం కురిసింది. హనుమకొండలోని బాలసముద్రం, కాకాజీ కాలనీ, బస్‌స్టేషన్, కాకతీయ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ భవన్ ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు పూర్తిగా వరద నీటి లో మునిగిపోయాయి. హంటర్‌రోడ్డులోని చిన్న బ్రిడ్జి వర్షం నీటితో నిండిపోయింది. అటువైపు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాదారులు అవస్థలు పడ్డారు. అడుగుకో గుంత ఉన్న నగర రహదారులపై వరద నీటిలో ప్రయాణించి నరకాన్ని చూశారు. మహబూబా బాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షం పడింది. దీంతో వీఎస్ లక్ష్మీపురం, జంగిలికొండ, పర్వతగిరి గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. డోర్నకల్, కురవి, కొత్తగూడ, గంగారం బయ్యారం మండలాల్లో ఎక్కువగా వర్షపాతం నమోదైంది. నర్సం పేటలో లోతట్టు ప్రాంతాలు జలయమమయ్యాయి. రోడ్ల మీదకి వర్షపు నీరు వచ్చి చేరింది. నర్సంపేటలో 25.6 మీ.మీ వర్షపాతం నమోదైంది.**

- వరంగల్ /మహబూబాబాద్ రూరల్ /నర్సంపేట, ఆగస్టు 6

# ఇక్కత్ చీరెను కాల్చివేసి నిరసన

### జనగామలో చేనేత కార్మికుల ర్యాలీ

జనగామ, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): జనగామ జిల్లా కేంద్రంలో చేనేత కార్మికులు చేనేత పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, చేనేత ఇక్కత్ ప్రింట్ అవుట్ చీరెలకు నిరసనగా చీరెను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రాచీన చేనేత కల కనుమరుగయ్యేలా సూరత్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో బడా కంపెనీలు పోచంపల్లి ఇక్కత్ గుర్తింపు పొందిన చీరెలను అచ్చం ప్రింట్ చేస్తూ చేనేత కార్మికుల వృత్తిని కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది చేనేత కార్మికులకు జీవనోపాధి లేకుండా చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా చేనేతను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని, చేనేతలకు సంక్షేమ పథకాలు కొనసాగించాలన్నారు. చేనేతపై జీఎస్టీని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జనగామ పట్టణంలోని వీవర్స్‌కాలనీ, బాణాపురం, బచ్చన్నపేట, ఎల్లంల, సిరిపురం, సిద్దంకి, లింగాలగణపురం, నవాబుపేట గ్రామాల నుంచి పెద్ద ఎత్తున చేనేత కార్మికులతో పాటు భారతి సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు, చేనేత నాయకులు మచ్చ బాల నర్సయ్య, ఎనగందుల కృష్ణ, బొంతపల్లి నాగరాజు, అంకం తిరుమలేశ్, కోడం శ్రీనివాస్, నరేశ్, ఏల శ్రీనివాస్, ఇస్తారి, నగేష్ పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం సంఘీభావం తెలిపారు.




జనగామ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు